ప్రజాశక్తి
శనివారం 9 సెప్టెంబర్ 2023

పాఠాలు బోధిస్తూ ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి-పెదబయలు: మండలంలో గంపరాయి పంచాయతీ చీడిపుట్టు ఎంపీ ఎలిమెంటరీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు జంపరంగి లలితశంకర్ పాఠాలు బోధిస్తూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందారు. పాఠాలు బోధిస్తుండగా ఉపాధ్యాయుడు కుప్ప కూలి పోయాడు. దీంతో, చీడిపుట్టు గ్రామస్తులు పాడేరు జిల్లా హాస్పిటల్‌కు తరలించారు. వైద్యులు పరీక్షల అనంతరం అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన జంపరంగి లలిత శంకర్ ఇటీవల బదిలీల్లో కుతంగి పుట్టు నుండి గంపరాయి పంచాయతీ చీడి పుట్టు ఎంపీ ఎలిమెంటరీ పాఠశాలలో బదిలీ పై వెళ్లారు. విధులు నిర్వర్తిస్తూ శుక్రవారం అకాల మృతితో విషాధఛాయలు అలుముకున్నాయి.

లలితశంకర్ (ఫైల్)

ఘాట్ రోడ్డులో రాకపోకలు పునరుద్ధరణ

- లారీ నిలిచిన మార్గంలో రహదారి డై వర్షన్ - నెమ్మదిగా వాహనాల కదలికలు

ప్రజాశక్తి-అనంతగిరి: అనంతగిరి ఘాట్ రోడ్డులో రెండు రోజులుగా రాకపోకల వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. ఘాట్ రోడ్డు శివలింగపురం, టైడా రెండో మలుపు వద్ద గురువారం మధ్యాహ్నం సమయంలో సిమెంట్ లోడుతో ఉన్న భారీ లారీ నిలిచి పోవడంతో రాకపోకలకు గంటల తరబడి ఆలస్యం నెలకొంది. మైదాన ప్రాంతం నుండి ఏజెన్సీ ప్రాంతంలో సిమెంట్ రవాణా చేస్తున్న తారస్ లారీ మధ్యాహ్నం సమయంలో మలుపు వద్ద సాంకేతిక లోపం కారణంగా నిలిచి పోయింది. దీంతో మైదాన ప్రాంతం నుండి ఏజెన్సీ ప్రాంతంనకు వెళ్లే వాహనాలు గంటల తరబడి నిలిచిపోవడంతో గురువారం నుండి శుక్రవారం మధ్యహ్నం వరకు కిలోమీటర్ల రెండు వైపులా వాహనాలు నిలిసి పోయాయి. దీంతో ప్రయాణికులకు గంటల తరబడి ఆలస్యం అయ్యింది. స్థానిక పోలీసులు ఘటనా స్థలంలో చేరి గురువారం అర్ధరాత్రి నుంచి పొక్లయినర్‌తో రోడ్డు మార్గాన్ని విస్తరణ పనులు చేపట్టారు. శుక్రవారం 12 గంటల నుండి ఒక్కొక్క వాహనాన్ని విస్తరణ చేపట్టిన మార్గం గుండా అనుమతించారు.

ఈ విధంగా ఘాట్‌రోడ్డులో ఎక్కడపడితే అక్కడ లోడుతో ఉన్న వాహనాలు రోడ్డుపై నిలిచి పోవడమే కాకుండా మరికొన్ని అదుపుతప్పి బోల్తా పటిన ఘటనలు జరుగుతూనే ఉన్నాయి.

నెమ్మదిగా కదులుతున్న వాహనాలు

పుష్పగుచ్ఛాన్ని ఇస్తున కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి ఘన స్వాగతం

ప్రజాశక్తి పాడేరు: అల్లూరి జిల్లా ఏజెన్సీ పర్యట నకు విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. ఎస్. జవహర్ రెడ్డికి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పాడేరు ఏజెన్సీ ముఖద్వారం గరికబంద చెక్ పోస్టు వద్ద శుక్రవారం సాయంత్రం పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఐటిడిఏ పి ఓ వి.అభిషేక్ విశాఖపట్నం ఎయిర్‌పోర్టు వద్ద పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లా అధికారులతో శనివారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించడానికి సిఎస్. పాడేరు చేరుకున్నారు. ఈ కార్య క్రమంలో రంపచోడవం ఐటిడిఏ పిఓ సూరజ్ గనోరే తదితరులు పాల్గొన్నారు.రాష్ట్ర చీఫ్ సెక్రటరీ డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి శుక్రవారం రాత్రి మోద కొండమ్మ అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పార్వతిపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వరి పొలాల పరిశీలన

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని గూడ రైతు భరోసా కేంద్రం పరిది కొడెలి గ్రామంలో వరి పొలాలను ఏరువాక కేంద్రం పాడేరు శాస్త్రవేత్తలు జే జగన్నాధం, జి.చిట్టిబాబు, పి.వెంకటరావు,మండల వ్యవసాయధికారి లీలావతి శుక్రవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ, నేలపై మట్టి తక్కువగానూ, గంధకం అధిక మోతాదులో ఉండటాన్ని గుర్తించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ సిబ్బంది మోహన్ పాల్గొన్నారు.

వేర్వేరు కేసుల్లో 920 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-మారేడుమిల్లి

రెండు వేరువేరు కేసుల్లో 920 కిలోల గంజాయిని మారేడుమిల్లి పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఎస్సై రాము తెలిపిన వివరాలు ప్రకారం... ఒడిశాకు చెందిన అభి రుంగూడ, కేశకు చెందిన నసీబ్, సంజిత్, అల్లూరి జిల్లా డుంబ్రిగూడకు చెందిన శెట్టి రాజు తదితర నలుగురు వ్యక్తులు ఒడిశా రాష్ట్రం చిత్రకొండ నుంచి కేరళకు టాటా గూడ్స్ కంటైనర్ వ్యాన్‌లో గంజాయిని తరలిస్తుండగా స్థానిక మద్దులూరు గ్రామ శివారులో పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 420 కిలోల గంజాయిని, ఒక బైకు, వ్యాన్ ఐదు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు.

మహరాష్ట్ర షోలాపూర్‌కు చెందిన అమోల్ హనుమంత్ పవార్, గణేష్ దేవకర్ అనే ఇద్దరు వ్యక్తులు మారుతి సుజుకి ఎర్టిగా కారులో గంజాయిని ధారకొండ నుంచి మహారాష్ట్రకు తరలిస్తుండగా మద్దులూరు గ్రామ శివారులో పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 500 కిలోల గంజాయిని, ఒక కారు, మూడు సెల్ ఫోన్లలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేశారు. ఇందులో మరో నిందితుడు నారాయణ పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ రెండు కేసులో పట్టుబడిన గంజాయి విలువ రూ.27.60 లక్షలు ఉంటుందని ఎస్సై తెలిపారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనంతబాబు, చిత్రంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి తదితరులు

కొత్త పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-కూనవరం

నూతనంగా మంజూరైన 242 పింఛన్లను కూనవరం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎమ్మెల్సీ అనంతబాబు, స్థానిక ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, స్థానిక ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి కొత్త పెన్షన్లు ప్రభుత్వం మంజూరు చేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు సిఫార్సు చేసిన తెలుగుదేశం కార్యకర్తలకే మంజూరు చేసే వారిని, వైసిపి ప్రభుత్వం వచ్చాక కుల మత ప్రాంతం పార్టీ అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ మండల కన్వీనర్ ఆవుల మరియదాసు, వైసీపీ మండల కన్వీనర్ ఆలూరి కోటయ్య, ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పిటిసి గుజ్జ విజయ, మేరు కులం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దికొండ లక్ష్మీప్రసాద్, గంగాధర్, పునుగుపాటి భరతమూర్తి, గుజ్జా బాబు, ఎంపిటిసి కొమ్మని అనంతలక్ష్మి, సర్పంచులు సున్నం అభిరామ్, కట్టం లక్ష్మి, అరవ దివాకర్, ఇంటి పూర్ణయ్య, చిచ్చాడి మంజుల, సచివాలయం కన్వీనర్లు, గృహ సారధులు, పంచాయతీ సెక్రెటరీ సురేష్, సీనియర్ అసిస్టెంట్ భీమ్ సింగ్ పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు

-ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

శకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు నియోజకవర్గంలోని జీకే వీధి మండలం మారుమూల ప్రాంతమైన కొంకితపాడు నుంచి నిమ్మలగొంది వరకు రహదారి నిర్మాణ పనులకు పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి శుక్రవారం శంకుస్థాపన చేశారు. 7.5 కిలోమీటర్ల ఈ రహదారి నిర్మాణానికి రూ.2.50 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసమే జగనన్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. తాను కూడా ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకోవడానికి ఈ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడిందన్నారు. పాడేరు నియోజకవర్గంలో నిమ్మల గొంది వంటి జిఎస్‌పీ రోడ్ల నిర్మాణానికి 5 మండలాలకు రూ.75 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ నిధులతో ఈ రహదారుల నిర్మాణం జరుగుతుందన్నారు. మర్రివాడ పంచాయతీ పరిధిలో ఎనిమిది గ్రామాల గడపగడప నిర్వహించినప్పుడే ఈ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని చెప్పారు. అంతాడ పంచాయతీ ఎద్దుమామిడి, సింగిధార, గంపరాయి, టెంకల పలుకులు గ్రామాలు ఈ రోడ్డుతో అనుసంధానం చేసుకునేలా మరో రహదారి నిర్మాణానికి ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశామని, ఇందుకు ఫారెస్ట్ శాఖ నుంచి అనుమతులు రావాల్సి ఉందన్నారు. మన అవసరాలతో పాటు అడవును కూడా కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, అటవీ శాఖ నిబంధనలకు అనుగుణంగా రహదారి నిర్మాణాలను అనుమతులు ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆ శాఖకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. సచివాలయాల నిర్మాణం, నాడు - నేడు కింద పాఠశాలలు, హాస్పిటల్స్, రహదారులు ఇవన్నీ కూడా అభివృద్ధిలో భాగమేనని చెప్పారు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం చేయలేని అభివృద్ధిని తాము చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సత్యవతి, ఎంపీటీసీ పిల్లా భవాని, గ్రామ పెద్ద సత్తిబాబు, ఎంపీపీలు బడుగు రమేష్, బోయిన కుమారి, మండల అధ్యక్షులు జల్లిబాబులు, సర్పంచ్ ఫోరం అధ్యక్షులు రేగటి ముసలి నాయుడు, కుందారి రామకృష్ణ, సర్పంచ్ చందు, పిఎసిఎస్ చైర్మన్ సూరిబాబు, మండల కన్వీనర్ బండి సుధాకర్, సీనియర్ నాయకులు గాడి సత్తిబాబు, శేఖర్, తిరుపతి, లోవరాజు, జీకే వీధి వైస్ ఎంపీపీలు ఆనంద్, దేవుడు, మాజీ జడ్పిటిసి మత్యరాజు, జిల్లా కార్యదర్శి కంకిపాటి గిరిబాబు, సీనియర్ నాయకులు నారాయణ, రామారావు పాల్గొన్నారు.

బారులు తీరిన గర్భిణులు, బాలింతలు

గర్భిణులు, బాలింతల అవస్థలు

-బ్యాంకు అకౌంట్ ఖాతాల నిమిత్తం ప్రత్యేక శిబిరం

-కానరాని కనీస సౌకర్యాలు

ప్రజాశక్తి -జి.మాడుగుల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శుక్రవారం గర్భవతులు, బాలింతలు అవస్థలు పడ్డారు. బ్యాంకు అకౌంట్ లేని వారికి ఆసుపత్రి వద్ద ప్రత్యేకంగా బ్యాంకు సిబ్బందితో క్యాంపు ఏర్పాటు చేశారు.అకౌంటు లేక పోవడంతో సుఖీభవ పథకం కోల్పోతున్నారని ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు స్థానిక డాక్టర్లు తెలిపారు. రెండు సంవత్సరాల లోపు పిల్లలకు వెంటనే బర్త్ సర్టిఫికెట్ ఇచ్చే ఏర్పాటు చేశారు. శుక్రవారం జి.మాడుగుల, సింగర్‌బా సచివాలయ పరిధిలో ఉన్న గర్భిణీలు, బాలింతలు తరలి వచ్చారు. గర్భవతులు, బాలింతలు అధిక స్థాయిలో ఆసుపత్రి వద్దకు రావడంతో కిక్కిరిసి పోయింది. వీరంతా కూర్చోడానికి పూర్తిస్థాయిలో సదుపాయాలు లేక చాలా సమయం క్యూ లైన్ లోనే చంటి బిడ్డలతో ఆస్పత్రి బయట నిలబడాల్సి పరిస్థితి ఏర్పడింది.

వేచివున్న బాలింతలు

గెస్టు లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో వివిద ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్టు లెక్చరర్ పోస్టులు భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియ జేసారు. అరకువ్యాలీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణితం 1, బోటనీ, షార్టు హాండ్ 1 పోస్టు, ముంచింగ్‌పుట్టు జూనియర్ కళాశాలలో గణితం 1, బోటనీ 1, దేవీపట్నంలో తెలుగు సబ్జెక్టు 1, రంపచోడవరం ఎంపిహెచ్ డబ్ల్యూ (ఎఫ్) 1, వి. ఆర్. పురంలో సివిక్స్ 1, చింతూరు ఫిజిక్స్ 1,కూనవరం తెలుగు 1, నెల్లిపాక తెలుగు 1 ,పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంగ్లం 1, ఫిజిక్స్ 1, ఎంపిహెచ్‌డబ్ల్యూ (ఎఫ్) 2 పోస్టులు భర్తీ చేస్తామన్నారు. ఎం.పి.హెచ్.డబ్ల్యూ పోస్టులకు బిఎస్సీ నర్సింగ్ విద్యార్హతలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. అతిథి లెక్చరర్ ఉద్యోగాలకు పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్ధులు ఈనెల 22 వ తేదీలో పాడేరు ఐ.టి.డిఏ ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఈనెల 25 వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు. ఆసక్తి కలిగిన అభ్యర్ధులు దరఖాస్తులు చేయాలని కోరారు.

ఓటరు జాబితాలో తప్పులు సరి చేయడానికి చర్యలు

ప్రజాశక్తి రంపచోడవరం

రంపచోడవరం నియోజకవర్గ పరిధిలో ఓటర్ జాబితాలో తప్పులు సరి చేయడానికి బూత్ స్థాయిలో తగు చర్యలు తీసుకోవడం జరిగిందని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ పేర్కొన్నారు. శుక్రవారం తన ఛాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ సవరణ ప్రక్రియ గురించి సబ్ కలెక్టర్ సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 11 మండలాల్లో బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల పేర్లు తప్పులు సరి చేయు విధంగా సర్వే చేసినట్లు తెలిపారు. ఫారం 6 ద్వారా ఓటర్ల నమోదు కొరకు 192 దరఖాస్తులు, ఫారం7 ద్వారా చనిపోయిన వారి పేర్లు తొలగించడానికి 129, ఫారం 8 ద్వారా ఓటర్ పేర్లలో తప్పులు, ఫొటోలు సరి చేయుటకు 213 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో ఏమైనా సమస్యలుంటే తెలియజేయాలన్నారు. నియోజకవర్గంలో 11 మండలాలలో ఇంటింటి సర్వే బూతు స్థాయిలో 99 శాతం పూర్తయిందన్నారు. దేవీపట్నం మండలంలో బడిగుంట గ్రామ ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు దగ్గర్లోని పోలింగ్ బూత్‌కు, తాళ్లూరు ప్రజలకు ఆర్ అండ్ ఆర్ కాలనీ దగ్గర్లో ఉన్న బూతులకు మార్చాలని ముర్ల కృష్ణారెడ్డి విజ్ఞప్తి చేశారు. రంపచోడవరం మండలంలో కింటికూరు గ్రామ ప్రజలకు దగ్గర్లో ఉన్న పోలింగ్ బూతులకు మార్చాలని సిహెచ్.సంతోష్ కుమార్ కోరారు. ఈ పోలింగ్ బూతులు మార్పులు చేర్పులు కొరకు ప్రతిపాదనలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్.బోజ్జి రెడ్డి, సిహెచ్.సంతోష్ కుమార్, మడకం వరప్రసాద్ దొర, ముర్ల కృష్ణారెడ్డి, శుభ కృష్ణ దొర, అనంత మోహన్, బాలు రెడ్డి, డిప్యూటీ తహశీల్దారు యన్‌వివి. సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్లు డి.ఇందిరాబాయి. టి.లక్ష్మణ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్

హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయరూ..

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని అన్నవరం వద్ద గల కూలిపోయిన బ్రిడ్జి వద్ద హెచ్చరిక బోర్డు పెట్టాలని ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు. మండల కేంద్రం రేఖపల్లి నుండి చింతూరు వెళ్లే ప్రధాన రహదారిలో అన్నవరం, ఉమ్మడివరం మధ్యలో ఉన్న పాత బ్రిడ్జి కూలిపోయింది. దీంతో తాత్కాలికంగా బ్రిడ్జి నిర్మించారు. అయితే పాత బ్రిడ్జి వద్ద హెచ్చరిక బోర్డు పెట్టలేదు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదాలు జరుగుతాయోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రేఖపల్లి నుండి చింతూరుకు 35 కిలోమీటర్లు ఉంటుంది. ఈ మార్గంలో సుమారుగా 40 గ్రామాలు ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి వేళలో కనపడక ప్రమాదాలు జరుగుతాయని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ప్రమాదాలు జరిగాయని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే హెచ్చరిక బోర్డులు పెట్టాలని అన్నవరం, ఉమ్మడివరం గ్రామాల ప్రజలు, వాహనచోదకులు డిమాండ్ చేస్తున్నారు.

కూలిపోయిన వంతెన వద్ద ప్రమాదకరంగా ఉన్న దృశ్యం

గొల్లగూడెంలో పశు వైద్య శిబిరం నిర్వహించాలి

ప్రజాశక్తి- విఆర్.పురం

మండల కేంద్రం రేఖపల్లి పంచాయతీ పరిధి గొల్లగూడెంలో గొర్రెలు వింత రోగాలతో మేతకు వెళ్లి చోట ఎరుపు రంగు మూత్రం పోసి చనిపోతున్నాయని, తక్షణమే పశువైద్య అధికారులు స్పందించి వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. గొల్లగూడెం గ్రామంలో మృత్యువాత పడిన గొర్రెలను సిపిఎం నాయకులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గొర్రెలు, మేకలు, గేదెలు తదితర పశు సంపదపై ఆధారపడి ఇక్కడి ప్రజలు జీవిస్తున్నారని తెలిపారు. ఈ సీజన్‌లో గాలి కుంటి వ్యాధులు, చిటిక రోగాలతోపాటు గొర్రెలు ఎరుపు రంగులో మూత్రవిసర్జన చేసి చనిపోతున్నాయని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి గొల్లగూడెం గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించి గొర్రెలు, ఇతర పశువులకు వైద్యం అందించాలని కోరారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

రూ.118 కోట్ల అవినీతిపై మౌనమెందుకు?

- పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి -సీలేరు

డొల్ల కంపెనీల పేరుతో రూ.118 కోట్లు దోచుకున్న దాని గురించి టిడిపి అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ ఎందుకు మౌనం వహిస్తున్నారని పాడేరు శాసనసభ్యులు కె.భాగ్యలక్ష్మి ప్రశ్నించారు. జీకే వీధి మండలం సీలేరులో శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు ప్రధాన అనుచరుడైన వాసుదేవ్ ఇంట్లో ఐటీ డిపార్ట్మెంట్ దాడులు జరిపిందని, ఈ నేపథ్యంలోనే రూ.118 కోట్లు కుంభకోణం చేసినట్లు బట్టబయలైందని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రతిపక్షాలు ఎందుకు స్పందించడం లేదన్నారు. అమరావతి రాజధాని నిర్మాణంలో భాగంగా చేసిన అభివృద్ధి లేకపోయినా, ఆ ప్రాంతంలో డొల్ల కంపెనీలు సృష్టించి 118 కోట్లు చంద్రబాబు దోసుకున్నది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఐటీ శాఖ దాడులు చేసి 118 కోట్లు స్కాం జరిగినట్లు గుర్తించి చంద్రబాబుకు నోటీసులు జారీ చేసిందని, వాటికి చంద్రబాబు సమాధానం ఇచ్చినప్పటికీ ఐటీ శాఖ సంతృప్తి చెందక తిరస్కరించిందని పేర్కొన్నారు. దీనిపై ప్రతిపక్షాలు మాట్లాడకపోవడం అన్యాయమన్నారు. కుంభకోణాలకు పాల్పడిన తెలుగుదేశం పార్టీ వారి భవిష్యత్తుకే గ్యారెంటీ లేనప్పుడు ప్రజలకు ఏం గ్యారెంటీ ఇస్తారని ప్రశ్నించారు. జరిగిన అవినీతిపై బట్టబయలు చేసి నిందితులను కచ్చితంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జికె.వీధి ఎంపిపి బి.కుమారి, వైస్ ఎంపీపీలు ఆనంద్, దేవుడు, స్థానిక ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి, స్థానిక సర్పంచ్ దుర్గో, ఉపసర్పంచ్ కె.వల్లి ప్రసాద్, దామనాపల్లి సర్పంచ్ రామకృష్ణ, వైసిపి జిల్లా కార్యదర్శి కంకిపాటి గిరి ప్రసాద్, నాయకులు బుజ్జీ వెంకట్రావు, శివరాం, నూకరాజు, అప్పారావు, స్వర్ణలత, కాంగ్రెస్ నాయకులు కారె శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ స్పెషల్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని చిన్నపిల్లలు, గర్భిణులకు రక్తహీనత లేకుండా వైఎస్ఆర్ పోషణ పథకం ద్వారా పౌష్టికాహార కిట్లును శుక్రవారం మండలంలోని పెదగెడ్డం గ్రామంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెదగెడ్డం గ్రామపంచాయతీ సర్పంచ్ వడగల ప్రసాద్ మాట్లాడుతూ వైయస్సార్ స్పెషల్ కిట్లు, పి1, పి2 ద్వారా పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. అంగన్వాడీలో చిన్న పిల్లలకు విద్యపై మక్కువ చూపే విధంగా అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో చిన్నపిల్లలు. గర్భిణులు, బాలింతలకు రక్తహీనత లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ జి.కుసుమ కుమారి. వివిధ అంగనవాడీ కేంద్రాలకు చెందిన అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు,అంగన్వాడి పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ ప్రసాద్, చిత్రంలో గర్భిణులు, బాలింతలు

సాగు భూమి వదిలేది లేదు

- హెచ్చరిక బోర్డు ఏర్పాటుతో గిరిజన రైతు ఆందోళన

హెచ్చరిక బోర్డు వద్ద రైతు

ప్రజాశక్తి -అనంతగిరి : పదేళ్లగా సాగులో ఉన్న భూమి వదిలేది లేదని, రెవిన్యూ అధికారులు గుర్తించి తమకు సాగు పట్టా మంజూరు చేయాలని కొత్తూరు పంచాయతీ తుమ్మనవలస గ్రామానికి చెందిన రైతు సోమ్మెల బీమా తెలిపాడు. ఈ సందర్భంగా రైతు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, తుమ్మలవలస రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 17లో మూడెకల ప్రభుత్వ భూమి గత పది ఏళ్ల నుండి సాగులో ఉంటూ వ్యవసాయ పంటలు పండిస్తూ జీవనాధారం సాగిస్తున్నానని పేర్కొన్నాడు. తమకు తెలియకుండా రెవిన్యూ అధికారులు తమ సాగు భూమి వద్ద హెచ్చరిక బోర్డు పెట్టారని తెలిపాడు.మండల రెవెన్యూ అధికారులు తనను గుర్తించి సాగు హక్కు పత్రం మంజూరు చేయాలని ఆయన కోరారు

పోషకాహారంపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ

ప్రజాశక్తి-పెదబయలు : పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా బొంగరం అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలు, భాలింతలకు శుక్రవారం సిడిపిఒ రాజేశ్వరి అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రంలో ఇచ్చిన బియ్యం, పప్పు, నూనె, గుడ్లు, పాలు గర్భిణీలు, భాలింతలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి పరామర్శ

పరామర్శిస్తున్న నేతలు

ప్రజాశక్తి -హుకుంపేట : సంతారి పంచాయతీ కుక్కిస గ్రామానికి చెందిన కూడేలి సింహాచలం మాస్టారు భార్య కాసులమ్మ మరణించడంతో శుక్రవారం స్వగృహంలో భౌతిక కాయానికి అసెంబ్లీ ఎస్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొర్ర సంతోష్ కుమార్, మాజీ సర్పంచ్ శతక బొంజు బాబు, టీడీపీ సీనియర్ నాయకులు బొడ్డ శ్యామ్, నాగేష్, మండల విద్యాశాఖ అధికారి సోమరి చెల్లయ్య తదితరులు నివాళి అర్పించారు.

మాట్లాడుతున్న ఎస్ఐ శివకుమార్

చదువు, క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

ప్రజాశక్తి - మోతుగూడెం

చదువు, క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని మోతుగూడెం ఎస్ఐ శివ కుమార్ అన్నారు. అల్లూరి జిల్లా, వై.రామవరం మండలం, డొంకరాయి పోలీస్ స్టేషన్ పరిధి బచ్చులూరు గ్రామంలో శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ యువత చదువు మీద శ్రద్ధ పెట్టాలని, అప్పుడే కుటుంబ పరిస్థితులు మెరుగై సమాజంలో మంచి గౌరవం ఏర్పడుతుందని తెలిపారు. ఏజెన్సీలో చదువుకున్న చాలామంది గ్రూప్ 1, గ్రూప్ -2 , ఎస్సై వంటి ఉన్నత ఉద్యోగాలు సాధించి అందరికీ మార్గదర్శి అవుతున్నారని తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తే భవిష్యత్తు బాగుంటుందన్నారు. గంజాయి సాగు చేయడం, అమ్మడం, రవాణా చేయడం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి, అరెస్ట్ చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో నాటు సారా అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాల్య వివాహాలు, క్షుద్ర పూజలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో బొడ్డగండి గ్రామ సర్పంచ్ సంధ్యా రాణి, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ డివిజన్లో మూడో లైన్లో మకుడి-సిర్పూర్-శ్రీపూర్-కాగజ్నగర్ స్టేషన్ల మధ్య ప్రీ-నాన్-ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా పలు రైళ్లు దారి మళ్లించబడ్డాయని అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 20805 విశాఖపట్నం - న్యూఢిల్లీ ఏపి ఎక్స్ప్రెస్ సెప్టెంబర్ 20 నుంచి 25 వరకు విజయనగరం, టిట్లాగఢ్, రాయ్పూర్, గోండియా, నాగ్పూర్ మీదుగా మళ్లించిన మార్గంలో నడుస్తుంది. 20806 న్యూఢిల్లీ - విశాఖపట్నం ఏపి ఎక్స్ప్రెస్ సెప్టెంబర్ 20 నుంచి 25 వరకు నాగ్పూర్, గోండియా, రాయ్పూర్, టిట్లాగఢ్, విజయనగరం మీదుగా మళ్లించిన మార్గంలో నడుస్తుంది. 20803 విశాఖపట్నం - గాంధీధామ్ ఎక్స్ప్రెస్ సెప్టెంబర్ 14, 21 తేదీల్లో విజయనగరం, టిట్లాగఢ్, రాయ్పూర్, గోండియా, నాగ్పూర్ మీదుగా మళ్లించిన మార్గంలో నడుస్తుంది. 20804 గాంధీధామ్ - విశాఖపట్నం ఎక్స్ప్రెస్ సెప్టెంబర్ 24న నాగ్పూర్, గోండియా, రాయ్పూర్, టిట్లాగఢ్, విజయనగరం మీదుగా మళ్లించిన మార్గంలో వెళ్తుంది. 12803 విశాఖపట్నం-హజ్రత్ నిజాముద్దీన్ స్వర్ణజయంతి ఎక్స్ప్రెస్ సెప్టెంబర్ 22, 25 తేదీల్లో విజయనగరం, టిట్లాగఢ్, రాయ్పూర్, గోండియా, నాగ్పూర్ మీదుగా మళ్లించిన మార్గంలో నడుస్తుంది. 12804 హజ్రత్ నిజాముద్దీన్ - విశాఖపట్నం స్వర్ణజయంతి ఎక్స్ప్రెస్ సెప్టెంబర్ 20, 24 తేదీల్లో నాగ్పూర్, గోండియా, రాయ్పూర్, టిట్లాగఢ్, విజయనగరం మీదుగా మళ్లించిన మార్గంలో, 20819 పూరీ-ఓఖా సూపర్ ఫాస్ట్ ఎక్స్ప్రెస్ సెప్టెంబర్ 24న విజయనగరం, టిట్లాగఢ్, రాయ్పూర్, నాగ్పూర్, వార్ధా మీదుగా మళ్లించిన మార్గంలో పయనిస్తుంది. ప్రజలు మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

విశాఖ ఉక్కును కాపాడుకుంటాం

ప్రజాశక్తి - ఉక్కునగరం :ఎంతో మంది త్యాగాలతో ఏర్పడి, వేలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పించిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు జె.రామకృష్ణ, వరసాల శ్రీనివాసరావు, గుమ్మడి నరేంద్ర తెలిపారు. స్టీల్ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 939వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ప్లాంట్లోని పలు విభాగాలకు చెందిన కార్మికులు కూర్చున్నారు.

ఫిజియోథెరపీకి పెరుగుతున్న ప్రాధాన్యత

గీతంలో ఘనంగా ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం

ప్రజాశక్తి- మధురవాడ : గీతం విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫిజియోథెరపి ఆధ్వర్యంలోశుక్రవారం ప్రపంచ ఫిజియోథెరపి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్సర్) ప్రో వైస్ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.గీతాంజలి మాట్లాడుతూ, వైద్య రంగంలో ఫిజియోథెరపి ప్రాధాన్యత పెరుగుతోందని, ముఖ్యంగా ఆర్థోపెడిక్ శస్త్ర చికిత్సల అనంతరం ఫిజియోథెరపి తప్పనిసరి అయిందన్నారు. క్రీడారంగంలోనూ ఫిజియోథెరపి ప్రాధాన్యతను గుర్తించారన్నారు.

ఫిజియోథెరపిలో నూతన చికిత్స పద్ధతులపై దృష్టి సారించాలన్నారు. గీతం స్కూల్ ఫిజియోథెరపి డైరక్టర్ డాక్టర్ మాధురి

జ్యోతిప్రజ్వలన చేస్తోన్న డాక్టర్ గీతాంజలి

సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు

కాశీ మాట్లాడుతూ శారీరక సమస్యలు, మహిళలు ముఖ్యంగా గర్భిణులు ఎదుర్కొంటున్న సమస్యలపై గతేడాది నిర్వహించిన ఫిజియోథెరపీ అవగాహన శిబిరాలకు మంచి స్పందన లభించిందన్నారు. ఫిజియోథెరపిలో అండర్గ్రాడ్యుయేట్ కోర్సును సహితం అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఫిజియోథెరపి విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

గరికపాటికి ఘననివాళి

రాజారావు వర్ధంతి సభలో మాట్లాడుతున్న అరుణ్జీ

ప్రజాశక్తి -కరాస :కళాతపస్వి, ప్రజానాట్యమండలి వ్యవస్థాపకులు డాక్టర్ గరికపాటి రాజారావు 60వ వర్ధంతిని 52వ వార్డు శాంతినగర్ హష్మి భవనంలో ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా కమిటీ నాయకులు అరుణ్ జి ,చంటి ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం చంటి, తెలుగు రమణ ఎం నాగేశ్వరరావు, రాగిణి యుటిఎఫ్ జిల్లా నాయకులు అప్పారావు, రాష్ట్ర నాయకులు నాగమణి తదితరులు పాల్గొని ప్రసంగించారు. డాక్టర్ వృత్తిని కొనసాగిస్తూ ప్రజల కోసం అనునిత్యం పరితపిస్తూ అనేక నాటికలు, నాటకాలు, కళారూపాల ద్వారా నిత్యం ప్రజా చైతన్యం కోసం గరికపాటి రాజారావు పాటుపడ్డారని వక్తలు కొనియాడారు. సభలో హష్మీ భవన్ డాన్స్ స్కూల్ నృత్య కళాకారులు పద్మ రాగిణి , విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆరిలోవ : డాక్టర్ గరికపాటి రాజారావు 60వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆరిలోవ లీలా సుందరయ్య కాలనీలో నిర్వహించారు. ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి, సీనియర్ నాయకులు వై.అప్పారావు, కవి ప్రసాద్, ఐద్వా నాయకులు రంగమ్మ పాల్గొన్నారు.

మరణంలోనూ సేవాభావం

ప్రజాశక్తి -ములగాడ: మరణంలోనూ వేరొకరికి కంటిచూపునిచ్చి 61వ వార్డు పారిశ్రామిక ప్రాంతం మల్కాపురం, పల్లివీధికి చెందిన గొలగాని సురేష్ యాదవ్ ఆదర్శంగా నిలిచాడు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న సురేష్ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. అయితే తాను బతికుండగానే కళ్లను దానం చేయాలని తల్లిదండ్రులు, కుటుంబీకులను కోరాడు. సురేష్ కోరిక మేరకు అతని తండ్రి గొలగాని అప్పలనాయుడు,తల్లి అప్పలనర్సమ్మ, అన్న శుక్రవారం ఎల్వి. ప్రసాద్ కంటి ఆసుపత్రికి సమాచారమిచ్చి, కళ్లను దానం చేశారు. పుట్టెడు దు:ఖంలోనూ సురేష్, అతని కుటుంబీకులు సేవాభావాన్ని పలువురు ప్రశంసిస్తున్నారు.

లోక్ అదాలత్ను వినియోగించుకోండి

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : జాతీయ, రాష్ట్రీయ న్యాయాధికార సంస్థల పిలుపుమేరకు ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని కోర్టులలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు డిఎల్ఎస్ఎ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, కార్యదర్శి, సీనియర్ సివిల్జడ్జి ఎంవి శేషమ్మ ప్రకటన విడుదల చేశారు. లోకదాలత్ను వినియోగించుకుని కక్షిదారులు తమ కేసులను రాజీలు చేసుకుని లబ్ధి పొందాలని సూచించారు. విశాఖపట్నం జిల్లాలోనిబ్యాంకులు, ఇన్సూరెన్స్,జివిఎంసి, పోలీసులు, ఇతర అన్ని శాఖలప్రధాన అధికారులతో సంప్రదించి, 4259 కేసులు రాజీకి గుర్తించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 39 ప్రజాన్యాయ పీఠాలు ఏర్పాటు చేసి ఈ కేసులను పరిష్కరించనున్నట్లు తెలిపారు.

ముగిసిన నేత్రదాన పక్షోత్సవాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిసాయి. జిల్లా అంధత్వ నివారణా సంస్థ చైర్మన్ కలెక్టర్ అధ్యక్షతన, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ పి.విశ్వమిత్ర ఆధ్వర్యంలో నిర్వహించిన పక్షోత్సవాల ముగింపులో కెజిహెచ్ సూపరెంటిండెట్ డాక్టర్ పి అశోక్కుమార్, డిఎంహెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు పాల్గొన్నారు. డాక్టర్ విశ్వమిత్ర మాట్లాడుతూ, పక్షోత్సవాల్లో భాగంగా బహిరంగ ప్రదేశాలు, విద్యాలయాల్లో ప్రభుత్వ, స్వచ్ఛందసంస్థల సహకారంతో నేత్రదానంపై అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించామన్నారు.

నిధుల్లేక నిర్వహణ వదిలేశారు

ఆయకట్టుకు సాగునీటి సమస్య
సగం కూడా జరగని వరి సాగు
75 వేల ఎకరాలకు 32 వేల ఎకరాల్లోనే పంట నమోదు
పిచ్చిమొక్కలతో నిండిన ప్రధాన కాలువలు

పిచ్చిమొక్కలు, గడ్డితో నిండి ఉన్న పెద్దేరు కుడి కాలువ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కంటే సాగునీటి వనరుల పట్ల ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యం రైతుకు తీరని నష్టం తెచ్చిపెట్టింది. ఏటా ఖరీఫ్ సీజన్కు ముందు జలాశయాలు, కాలువల మరమ్మతులు, నిర్వహణ పనులు చేపట్టాల్సివుంది. అడ్డంకులు లేకుండా ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేయడం నీటిపారుదల శాఖ కనీస బాధ్యత. అయితే ఈ ఖరీఫ్కు ముందు ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో నిర్వహణ పనులను ఆ శాఖాధికారులు చేపట్టలేదు. దీంతో జలాశయాల్లో ఉన్న నీటిని ఆయకట్టుకు సరఫరా చేయలేని పరిస్థితి ఈ ఏడాది ఏర్పడింది. అటు వర్షాల్లేక, ఇటు ఆయకట్టుకు సాగునీరు ఇవ్వలేక ఖరీఫ్ కాలపరిమితి ముగుస్తున్నా ఉడుపులు చేయలేని దీనావస్థలో రైతులున్నారు. జిల్లాలో సాధారణ వరి సాగు విస్తీర్ణం 1.36 లక్షల ఎకరాలకు ఈ నెల 7 నాటికి 81,802 ఎకరాల్లో (60 శాతం) నమోదైంది. వరి సాగుకు గడువు దాదాపు చివరకొచ్చింది. ఇంకా 40 శాతం సాగు కాలేదు. సాగైన వరి పంటలో దాదాపు సగం పంట వర్షాల్లేక, ఆయకట్టుకు నీరు అందక ఎండిపోతోంది. అయినా ఎమ్మెల్యేలు చొరవ తీసుకొని రైతును ఆదుకొనే మార్గాలు అన్వేషించడంలేదు. ప్రభుత్వ యంత్రాంగంతో జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించనూలేదు.

ఒక భారీ, మూడు మధ్య తరహా జలాశయాల కిందవున్న ఆయకట్టులోని సగం విస్తీర్ణంలో కూడా వరి సాగు నమోదుకాలేదు. భారీ ప్రాజెక్టు తాండవ, మధ్య తరహా ప్రాజెక్టులు పెద్దేరు, కోనాం, రైవాడ కింద మొత్తం 75,114 ఎకరాల ఆయకట్టు వుంది. ఈ నెల ఏడు నాటికి ఈ జలాశయాల కింద 32,001 ఎకరాల్లో (42 శాతం) వరి సాగైంది. ఆయకట్టుకు సాగునీరు అందించే ప్రధాన కాలువలు మొదలుకొని పిల్ల కాలువల వరకు నిర్వహణ చేయకపోవడం, ప్రాజెక్టు మెయిన్గేట్ వద్ద లీకేజీలు నియంత్రించకపోవడం, మదుములు దెబ్బతినడం వంటి పలు సమస్యలు వల్ల ఆయకట్టుకు సక్రమంగా నీరు అందించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో జలాశయాల ఆయకట్టులో వరి సాగు కాలేదు. వరి సాగైన ప్రాంతాల్లో నీరు ఇవ్వలేక, వర్షాల్లేక ఉడిసిన వరి పొలాలు ఎండిపోతున్నాయి. తాండవ కింద అనకాపల్లి జిల్లాలో 32,689 ఎకరాలు, కాకినాడ జిల్లాలో 18,776 ఎకరాలు మొత్తం 51,465 ఎకరాల ఆయకట్టు వుంది. ఇంత ప్రధానమైన ప్రాజెక్టు మెయిన్ గేట్ లీకేజీతో నీరు వృధాగా పోతున్నా, మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. పెద్దేరు కాలువ పనులు చేపట్టకపోవడంతో.. ఆయకట్టుకు నీరు ఇవ్వలేకపోవడంతో దీనికిందవున్న పొలాల్లో ఉడుపులు సగం కూడా కాలేదు. పెద్దేరు కుడి కాలువ చిన్నపాటి అడవిని తలపించేలావుంది. పిచ్చి మొక్కలతో గుర్తుపట్టలేనంత ఘోరంగా తయారైంది. పెద్దేరు కింద 15,105 ఎకరాలకు 7,187 ఎకరాలు (47.58 శాతం) సాగైంది. కోనాం కింద 12,276 ఎకరాలకు 7,100 ఎకరాలు (57.84 శాతం), రైవాడ కింద 15,344 ఎకరాలకు 6,464 ఎకరాలు (42.13 శాతం) వరి సాగైంది. వరి సాగు చేసేందుకు ఆకులు కూడా కొన్ని ప్రాంతాల్లో ముదిరిపోగా, కొన్నిచోట్ల ఎండిపోయాయి. శారదా నది పరిధిలోవున్న గ్రోయిన్లు మరమ్మతు చేపట్టకపోవడంతో వాటి పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందడంలేదు. పూడిగెడ్డ, పెదపాడు కుల్లి కాలువ, కొండకర్లఆవ కాలువ నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో ఆ కాలువలు తుప్పలతో నిండివున్నాయి.

నేడు ఎయు స్నాతకోత్సవం

హాజరుకానున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్
అల్లూరి ఇంద్రకుమార్, కొలకలూరి ఇనాక్లకు గౌరవ డాక్టరేట్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం 87, 88, 89, 90 సంయుక్త స్నాతకోత్సవం నేడు జరగనుంది. శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు కట్టమంచి రామలింగారెడ్డి స్నాతకోత్సవ మందిరంలో ప్రారంభం కానున్న ఈ స్నాతకోత్సవానికి ఛాన్సలర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరవుతారు. ముఖ్య అతిథిగా జిఎంఆర్ సంస్థల అధినేత, ఎయు పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక చైర్మన్ జిఎం.రావు హాజరై స్నాతకోత్సవ ప్రసంగం అందిస్తారు. స్నాతకోత్సవంలో గౌరవ డాక్టరేట్లను పరిశ్రమలు - శాస్త్ర రంగంలో అవంతి ఫీడ్స్ సంస్థ ఎమ్డి అల్లూరి ఇంద్రకుమార్ (డిఎస్సి), సాహిత్యం-కళా రంగాలలో ఎస్వి.యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి కొలకలూరి ఇనాక్ (డిలిట్)లకు అందించనున్నారు. స్నాతకోత్సవంలో డాక్టరేట్లను 690 మంది, మెడల్స్ను 600 మంది అందుకోనున్నారు. 2500 మంది హాజరుకానున్నారు. ఈ మేరకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్నాతకోత్సవ ఏర్పాట్లను ఎయు వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాద రెడ్డి శుక్రవారం స్వయంగా పర్యవేక్షించారు. అధికారులతో కలిసి కార్యక్రమ నిర్వహణపై చర్చించారు.

గవర్నర్కు ఘన స్వాగతం

జిల్లాలో నాలుగు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ శుక్రవారం సాయత్రం విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకున్నారు. నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా ఇన్ఛార్జి కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, జెడ్పి ఛైర్పర్సన్ జె.సుభద్ర, జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ, తదితరులు ఆయనకు విమానాశ్రయంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ పోర్ట్ అతిథి గృహానికి చేరుకున్నారు. అక్కడ ఆయనకు పోర్టు డిప్యూటీ ఛైర్పర్సన్ దుర్గేష్ కుమార్ దుబే, కార్యదర్శి టి.వేణుగోపాల్ స్వాగతం పలికారు. శనివారం గవర్నర్ ఎయులోని మూడు హాస్టళ్లను ప్రారంభించనున్నారు.

11న ఐటిడిఎ వద్ద నిరసన

- గిరిజన ఉద్యోగుల సంఘం నోటీసు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల అధికారుల తీరుకు నిరసనగా అఖిల భారత ఆదివాసి గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి ఐటిడిఎ వద్ద నిరసన కార్యక్రమాలు, రిలే దీక్షలు నిర్వహిస్తామని, ఈ మేరకు ఐటిడిఎ పిఒ వి.అభిషేక్కు నిరసన సమ్మె నోటీసు అందజేశామని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముఖి శేషాద్రి బి.సింహాచలం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివాసీ ఉద్యోగ, ఉపాధ్యాయులపై అధికారులు నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ బదిలీలు, డిప్యూటేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులను అన్యాయంగా సస్పెండ్ లు, సరెండర్ లతో కక్ష్య సాధింపు చర్యలు తీసుకోవడం సరి కాదని విమర్శించారు. జిఒ-3 రద్దు అంశంపై సుప్రీంకోర్టులో రివ్యూ కొనసాగుతుండగా, ప్రభుత్వం నుండి ఎటువంటి మార్గదర్శకాలు లేకుండానే దొడ్డి దారిన రూల్ ఆఫ్ రిజర్వేషన్ను అమలు చేస్తూ వివిధ ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వడం ఆదివాసీలకు తీరని అన్యాయమేనని తెలిపారు. పేషియల్ అటెండెన్స్ ఆదివాసీ ప్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయులకు సడలింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖాధారిత హాజరుతో జీతాలను లింక్ చేయడం ఉద్యోగ, ఉపాధ్యాయులను తీవ్ర ఒత్తిడికి గురి చేయడమేనని పేర్కొన్నారు. సమస్యలు నేటివరకు పరిష్కారానికి నోచుకోకపోవడంతో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం, జెఎసి సంయుక్తంగా నిరసన కార్యక్రమాలు, రిలే దీక్షలకు దిగుతోందని పేర్కొన్నారు.

13న ఐటిడిఎ వద్ద ధర్నా

ప్రజాశక్తి-పాడేరుటౌన్:నకిలీ ఎస్టి ధ్రువపత్రాలను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ అంతర్జాతీయ ఆదివాసి హక్కుల దినం రోజు సెప్టెంబర్ 13న పాడేరు ఐటిడిఎ వద్ద ధర్నాను జయప్రదం చేయాలని జెఎసి జిల్లా కన్వీనర్ రామారావు దొర పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటివరకు జారీ చేసిన నకిలీ ఎస్ టి ధ్రువపత్రాల కేసులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు సత్వర చర్యలు చేపట్టాలని కోరారు. నకిలీ ఎస్ టి ధ్రువపత్రాలు పొందిన, జారీ చేసిన అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. జగనన్న సురక్ష పేరితో అనేక దొంగ ఎస్టి ధ్రువపత్రాలు జారీ అయ్యాయని పేర్కొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలి

పోస్టరు, ట్రోఫీలను ఆవిష్కరిస్తున్న సినీనటుడు సుమన్

ప్రజాశక్తి -గాజువాక :ఆత్మరక్షణకు కరాటే వంటి కళలను నేర్చుకోవాల్సిన అవసరం ఉందని సినీనటుడు సుమన్ తల్వార్ అన్నారు. ఎపి కెన్యూర్యూ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17న గాజువాక బిసి రోడ్డులోని అగ్నికుల క్షత్రియ కల్యాణ మండపంలో నిర్వహించనున్న 15వ ఎపి స్టేట్ ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ పోటీల పోస్టర్ను, ట్రోఫీని ఆవిష్కరించారు.

చీఫ్ ఆర్గనైజర్ కోరాడ సుమన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నటుడు సుమన్ మాట్లాడుతూ మహిళలపై అఘాయిత్యాలు, దాడులు పెరుగుతున్న నేపథ్యంలో, నష్టం జరిగాక బాధపడే కన్నా ఆత్మరక్షణకు ముందుగా ఇటువంటి యుద్ధకళలను నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు డి మోదినాయుడు, పి ధనుంజయ్, పి శివప్రసాద్, కె ఉమామహేష్, ఎంకెటి ట్రాన్స్పోర్టు అధినేత బొడ్డేటి ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

డిమాండ్లను నెరవేర్చకుంటే 16 నుంచి సమ్మె

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఈసరికే సమర్పించిన సమ్మె నోటీసులో పేర్కొన్న డిమాండ్లను నెరవేర్చకుంటే ఈ నెల 16 నుంచి మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మెకు దిగటం తప్పదని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి, అధ్యక్షుడు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు తెలిపారు. శుక్రవారం జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకట కుమారికి మరోసారి వారు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ జివిఎంసి పారిశుధ్య విభాగంలో 482 పోస్టులను భర్తీ చేయాల్సి ఉండగా 218 పోస్టులనే భర్తీ చేశారని తెలిపారు. ప్రస్తుతం పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, లాంగ్ సిక్, ఆబ్సెంట్ కార్మికులు, చనిపోయిన, 60 సంవత్సరాలు దాటిన కార్మికుల బిడ్డలతో మిగిలిన పోస్టులను భర్తీ చేయాలన్నారు. జనాభా, నగర విస్తీర్ణం పెరుగుదల మేరకు సిబ్బంది సంఖ్యను పెంచాలన్నారు, క్లాప్ డ్రైవర్లకు రూ.18500 జీతం ఇవ్వాలని, క్లాప్ వాహనాలకు అదనంగా సిబ్బందిని నియమించాలని కోరారు. కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జె.నాయుడు, సత్యనారాయణ, అనిల్ కుమార్, సురేష్, ఎం.ఈశ్వరరావు పాల్గొన్నారు.

జీతాలు పెంచాలని..

సెవెన్హిల్స్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ నగరంలోని సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికుల జీతాలు పెంచాలని సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం విశాఖ జిల్లా హాస్పిటల్ అండ్ నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం లేబర్ ఆఫీసు వద్ద సెవెన్ హిల్స్ కార్మికులు ధర్నా నిర్వహించారు. తమ జీతాలు పెంచాలని పెద్దపెట్టున నినదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి పని చేస్తున్నప్పటికీ సెవెన్ హిల్స్ కార్మికులకు జీతాలు పెంచడం లేదని, ఇంక్రిమెంట్లు ఇవ్వడం లేదని అన్నారు. చట్టపరమైన బోనస్ కూడా ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న మహిళలపై తీవ్ర పని ఒత్తిడి, అధికారుల వేధింపులు ఉన్నాయన్నారు. కార్మికులను కించపరిచేలా మాట్లాడటం తగదన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పలుమార్లు యాజమాన్యానికి వినతి పత్రం ఇచ్చినప్పటికీ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ధర్నా అనంతరం ఎసిఎల్ సర్కిల్ అధికారికి వినతి పత్రం సమర్పించారు. ఆయన స్పందిస్తూ వెంటనే జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి, సెవెన్ హిల్స్ హాస్పిటల్ కార్మికుల సంఘం నాయకులు సిహెచ్.నూకరాజు, శ్రీను, వెంకటరావు, సిలోమని, రాజి, వరలక్ష్మి, డివైఎఫ్ఐ నాయకులు సంతోష్ కుమార్, అక్కయ్యపాలెం జోన్ నాయకులు రాజు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

'విశాఖలో రూ.2800 కోట్ల కుంభకోణం'

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తప్పుడు పత్రాలతో రూ. 2800 కోట్ల టిడిఆర్ ప్రాతిపాదనలకు వైసిపి ఎంపీ విజయసాయిరెడ్డి ఆదేశాలతో జివిఎంసి అధికారులు ఫైలు కదుపుతున్నారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయసాయిరెడ్డి పెద్ద స్కాంకు విశాఖలో తెరతీశారన్నారు. వందేళ్ల నాటి రాణి సాహిబా వాద్వాన్ భూమి అంటూ పెదజాలరిపేట మత్స్యకార గ్రామంపై చేసిన క్లెయిమ్ను వివరించారు. ఏళ్ల తరబడి విశాఖలో ఉన్న ఆస్తులను అధికారాన్ని ఉపయోగించి అనుచరులకు, అనుయాయులకు ఎంపీ విజయసాయిరెడ్డి అడ్డంగా దోచిపెడుతున్నారన్నారు.

తపాలా ఏజెంట్ల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తపాలా శాఖ అందిస్తున్న జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా సేవలను విస్తృతం చేసేందుకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తపాలా శాఖ విశాఖపట్నం సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసు జి.హరిప్రసాద్ ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వెల్లడించారు. పదో తరగతి పూర్తి చేసిన ఆసక్తిగల అభ్యర్థులను విశాఖపట్నం డివిజన్లో కమీషన్ ప్రతిపాదికన నియమిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 0891 - 2546237 నెంబర్ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

వధువుకు తాళి బొట్టు, పట్టు వస్త్రాల వితరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసి 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు శుక్రవారం తన కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో నవవధువు వరలక్ష్మీదేవికి బంగారు తాళిబొట్టు, పట్టు వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ప్రజాసేవే పరమావధి అన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నళినిదేవి కిరణ్ ప్రసాద్, యజ్ఞశ్రీ, వర, శ్రీదేవి, కోదండమ్మ పాల్గొన్నారు.